



సాధన నవల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఆర్కె, వెంకటకృష్ణ, డాక్టర్ శాంతినారయణ తదితరులు

నేడు మండలి పోరు

- ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మండలి పోరుకు కర్నూలు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ నిర్వహించనున్నారు....

జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగనుంది. కర్నూలు జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 74 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 27 పోలింగ్ కేంద్రాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కలిపి 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 61,633 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 5,391 మంది, స్థానిక సంస్థల ఓటర్లు 1178 మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 74 మంది పీవోలు, 74 మంది ఏపీవోలు, 148 మంది ఓపిఓలను నియమించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 27 మంది పిఓలు, 27 మంది ఏపీవోలు, 54 మంది ఓపిఓలను నియమించారు. 34 మంది పిఓలు, 34 మంది ఏపీవోలు, 68 మంది ఓపిఓలు రిజర్వులో ఉంచారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 6 మంది పీవోలు, 6 మంది ఏపీవోలు, 12 మంది ఓపిఓలను నియమించారు. ఒక పిఒ, ఒక ఏపీఓ, ముగ్గురు ఓపివోలను రిజర్వులో ఉంచారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు ఒక్కొక్కరు చొప్పున 107 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 22 మంది మైక్రో అబ్జర్వర్లను రిజర్వులో ఉంచారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 56 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ కూడా ఏర్పాటు చేశారు. కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లో 12 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్కార్డులు ఏర్పాటు చేశారు. బందోబస్తు కోసం 1124 మంది పోలీసులను నియమించారు.



కర్నూలు 137 బూత్‌లో పోలింగుకు సిద్ధం చేసిన బాక్సులు

కౌటింగ్ కేంద్రాలు ఇలా...

స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరగనుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్‌ను అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో నిర్వహించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు నడుమ అనంతపురం కౌంటింగ్ సెంటర్‌కు పంపనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నారు.

లోకజ్ఞానాన్ని మార్క్సిజం స్థాయికి పెంచాలి

సాధన నవల ఆవిష్కరణ సభలో ప్రముఖకవి హెచ్‌ఆర్‌కె

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

పుస్తకాన్ని చదివే ప్రతిపాఠకుడూ రచయితేనని చదివిన సారంలోని తత్వాన్ని లోకజ్ఞానంగా సంపాదించుకున్న లోకజ్ఞానాన్ని మార్క్సిజం స్థాయికి పెంచాలని ప్రముఖకవి హెచ్‌ఆర్‌కె అన్నారు. నగరంలోని లలిత కళాసమితిలో ఆదివారం ఉదయం అనంతపురంకు చెందిన రచయిత డాక్టర్ శాంతినారాయణ రచించిన సాధన నవల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ నవలను ఆవిష్కరించిన హెచ్‌ఆర్‌కె మాట్లాడుతూ రాయలసీమలో సాహిత్యం కొత్తపుంతలు తొక్కుతోందని ఈ వొరవడి కొనసాగాలన్నారు. కవిత్వం, కథలలో తనదైన పాత్ర పోషిస్తుందని ఇది సాహిత్యానికి ముఖ్యంగా భారతీయసాహిత్యానికి శుభపరిణామమన్నారు. సాధన నవల రాయలసీమ నీటి సమస్యను ప్రస్ఫుటంగా చూపటమే కాక అనేకానేక ప్రశ్నల్ని లేవనెత్తిందన్నారు. అనేక చారిత్రక విషయాలను చెబుతూనే మన కళ్ళ ముందు వర్తమానస్థితిని తేటతెల్లం చేసిందన్నారు. కవికి సామాజిక కోణం అనివార్యమని ,ఈతరుణంలో సాగేప్రయాణం ప్రజాచైతన్యం వైపు సాగాలని సామాన్యుల కవసరమైన అక్షరాలను సృష్టించగలిగినప్పుడే సాహిత్య సామాజిక ప్రయోజనం నెరవేరుతుందన్నారు. నవలను పరిచయం చేసిన నాగేశ్వరాచారి మాట్లాడుతూ సాధన రాయలసీమ అస్తిత్వాన్ని నీళ్ళను కన్నీళ్ళతో తడుపుతుందన్నారు. రాజకీయ రాబంధులు చేసే మోసాలను రచయిత సృజనాత్మకంగా చెప్పారన్నారు. ప్రముఖరచయిత బండినారాయణ స్వామి మాట్లాడుతూ గాయపడిననేల అన్న ఉపశీర్షికతో సాగిన ఈ సాధన నవల రాయలసీమ సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుందని, వర్తమాన పరిస్థితుల్లో అవసరమైనదన్నారు. రాయలసీమలో ఏయే ప్రాంతం ఏవిధంగా పాలకుల నిర్లక్ష్యానికి బలైందో ఏ జిల్లాని ఏవిధంగా మోసం చేశారో సమగ్రమైన ఆధారాలతో ఈ నవల అత్యంత సృజనాత్మకంగా రూపుదిద్దుకున్నదన్నారు. డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ ఈ నవలకు ప్రధాన కారణం సీమ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలేనని, ఈ నవలను సీమలోని సాహిత్యకారులందరూ ఆదరిస్తున్నారన్నారు. సభాధ్యక్షులుగా జి.వెంకటకృష్ణ వ్యవహరించిన ఈ పుస్తక పరిచయ సభలో కవులు జంధ్యాల రఘుబాబు, మారుతీ పౌరోహితం, ఇనాయతుల్లా, ఆవుల చక్రపాణి యాదవ్, నెమిలి చంద్రశేఖర్‌రెడ్డి, డి.అయ్యన్న, సయ్యద్ జహీర్‌అహ్మద్, ఎవిరెడ్డి, పఠాన్ సుల్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటు ధరలో రవాణా సౌకర్యం

- ఇంటి వద్దకే డెలివరీ సేవలు- పార్శిల్ వస్తువులకు భరోసా
- ప్రజాశక్తితో ఆర్‌టిసి కార్గో ఎటిఎం పి.ధనమ్మ



ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

"ఎపిఎస్ఆర్‌టిసి సరుకుల రవాణా ప్రారంభించి పార్శిల్, కొరియర్ సేవలతో రాష్ట్రంలో ప్రజాదరణ పొందింది. రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ప్రతి నెల 5 లక్షల పైబడి పార్శిల్‌లను 24 గంటల్లో రవాణా చేస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్న ఆర్‌టిసి మరో ముందడుగు వేసి డోర్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. ఇంటి వద్దకే పార్శిల్‌లను డెలివరీ చేస్తున్నాం. అందుబాటు ధరలో పార్శిల్ సేవలను అందించడంతో పాటు పార్శిల్‌లకు భరోసా అందిస్తున్నాం..' అని ఆర్‌టిసి కార్గో కర్నూలు ఎటిఎం పి.ధనమ్మ తెలిపారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

మీరు ఎక్కడి నుండి బదిలీపై వచ్చారు?

ఎటిఎం : పశ్చిమగోదావరి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ గ్రేడ్ 2గా పని చేస్తూ తణుకు నుండి బదిలీపై జనవరి 27న వచ్చి చేరాను.

కార్గో సేవలు ఎప్పటి నుండి ప్రారంభించారు?

ఎటిఎం : ఎపిఎస్ ఆర్‌టిసి 2019 నుండి కార్గో సేవలను ప్రారంభించింది.

ఏ వస్తువులను కార్గో ద్వారా రవాణా చేస్తారు?

ఎటిఎం : 50 కేజీల బరువు గల పార్సిల్ పది కిలోమీటర్ల లోపు డోర్ డెలివరీ చేస్తాం. అలాగే ఒక టన్ను వరకు టాప్ పైన గానీ డిక్కీలో గానీ వస్తువులు రవాణా చేయబడును. వెయ్యి టన్నుల సరుకు ఉన్నట్లయితే గూడ్స్ ద్వారా రవాణా చేస్తాం. వినియోగదారులు పార్సిల్‌లో బుక్ చేసేటప్పుడు బుకింగ్ ఛార్జీలతోపాటు డోర్ డెలివరీ చార్జీలు కూడా చెల్లించి పార్సెల్ పొందువారి చిరునామా, ఫోన్ నంబరు, పిన్‌కోడ్, డోర్ నంబర్ల వివరాలు తెలియజేసి డోర్ డెలివరీ సదుపాయము పొందవచ్చు.

కార్గోను ఎవరు నిర్వహిస్తున్నారు?

ఎటిఎం : వస్తువుల రవాణా, నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పడం జరిగింది. 24/7 గంటలు వస్తువుల రవాణా చేసేందుకు ఆ సంస్థ 20 మందిని, కావలసిన కంప్యూటర్లు ఇతర సామాగ్రి సమకూర్చి బుకింగ్ చేసే వారిని నియమిస్తారు.

ప్రతి రోజు ఎన్ని బుకింగ్ జరుగుతున్నాయి?

ఎటిఎం : ప్రతిరోజు మూడు కౌంటర్ల ద్వారా మూడు షిఫ్టులలో 600 బుకింగ్‌లు చేయబడుతున్నాయి. రోజుకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.

కార్గో ద్వారా వస్తువుల రవాణా మార్కెటింగ్ చేసేందుకు ఎవరైనా ఉన్నారా?

ఎటిఎం : వస్తువుల మార్కెటింగ్ చేసేందుకు రంగన్న అనే వ్యక్తి ఉన్నాడు. ఇతను కంపెనీలతో సత్సంబంధాలు కలిగి వారి వస్తువులను కార్గో ద్వారా పంపడానికి కృషి చేస్తుంటాడు.

పార్సిల్‌లను, కవర్లను ఏఏ ప్రాంతాలకు పంపిస్తారు?

ఎటిఎం: బస్సులలో పార్సిల్‌లను, కవర్లను తెలంగాణలోని హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్లోని 85 ప్రధాన పట్టణాలకు 24 గంటల్లోపు చేరుస్తాం, ప్రాంత దూరాన్ని బట్టి ఛార్జీలు వసూలు చేస్తాం.

కార్గోలో పనిచేసేవారు బుకింగ్ చేసిన డబ్బులు వాడుకుంటున్నారని సమాచారం. అందుకు మీ సమాధానం ఏమిటి?

ఎటిఎం : బుకింగ్ చేసిన డబ్బులు కంప్యూటరీకరణ చేయబడి ఉంటుంది. కాబట్టి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు అంతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఎవరు డబ్బులు వాడుకోవడానికి వీలుండదు.

ఇక్కడ పనిచేసే వారికి ఏ నెలకి ఆ నెల జీతాలు ఇవ్వకపోడం ద్వారా మానుకొని పోతున్నారని, ఐదు నెలలు పని చేస్తే రెండు నెలల జీతాలు మాత్రమే ఇస్తున్నారని తెలిసింది. దీనికి మీ సమాధానం ఏమిటి?

ఎటిఎం : కార్మికులకు అన్యాయం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకొని వారికి న్యాయం చేస్తాం.

2022- 2023 సంవత్సరానికి కార్గో ద్వారా వచ్చిన ఆదాయం ఎంత?

ఎటిఎం : 2022 ఏప్రిల్ నుండి 2023 జనవరి వరకు రూ.642.12 కోట్లు టార్గెట్ కాగా జనవరి నాటికి రూ.419.82 కోట్లు టార్గెట్‌ను చేరుకున్నాము.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు, చిత్రంలో జెసి రామ్‌సుందర్ రెడ్డి

వెబ్ కాస్ట్ కెమెరాల ట్రయల్‌రన్ పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వెబ్ కాస్ట్ కెమెరాల ట్రైల్ రన్‌ను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పరిశీలించారు. ఆదివారం సాయంకాలం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లోని వెబ్ కాస్ట్ కెమెరాల పనితీరును జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగుకు సంబంధించి 107 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగుకు సంబంధించి ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును కంట్రోల్ రూమ్ నుండి పరిశీలించామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కెమెరాలు బాగా పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సులు కనప డకుండా మిగతా పరిసర ప్రాంతాలు కెమెరాలో కనపడే విధంగా ఏర్పాటు చేశామని, వాటి పని తీరుకు సంబంధించి ఈరోజు ట్రైల్‌రన్ నిర్వహిం చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెబ్ కాస్ట్ కెమెరాలకు, వీడియో గ్రాఫిక్ సంబంధించిన నోడల్ అధికారి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్వామ్యుల్ పాల్

టెన్త్ లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

విద్యాశాఖ ఎడి సామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలోని బాలిక ఉన్నత పాఠశాల మరియు ఉర్దూ పాఠశాల కర్నూలు మండలంలోని జి.సింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. పాఠశాలలకు సెలవు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు వచ్చి బోధించడం అభినందనీయమన్నారు. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎ.సబ్జెక్టులో అయితే వెనకబడి ఉన్నారో అలాంటి వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించా మన్నారు. అందులో భాగంగా ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో నూటికి 100శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. ఆ ప్రణాళిక అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భరితెగించిన వైసిపి

చోద్యం చూస్తున్నా ఎన్నికల అధికారులు-పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో అనేక వీధులలో గ్రాడ్యుట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారపార్టీ భరితెగించి డబ్బు పంపిణీ చేస్తుందని సిపిఎం నాయకులు విమర్శించారు. పోలీసులు, ఎన్నికల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకొక్కచోట ఒకరకంగా ఓటుకు రూ. వెయ్యి రెండు, మూడు వేల చొప్పున ఓటర్లకు ఫోన్ చేసి పంపిణీ చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వగా మూడవ పట్టణ పోలీసు స్టేషన్ అధికారులు వస్తున్నాం. అంటూ కాల యాపన చేయటమే తప్ప చర్యలు తీసుకోవటం సూన్యం అని సిపిఎం శ్రీరామనగర్ లక్ష్మీనగర్ ఏరియా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. 290,291 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటుకు నోటు అంటూ కాల్ చేసి డబ్బులు పంపిణీ కార్యక్రమంలో వైసిపి స్థానిక నాయకుడు ఆషిఫ్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు. వారిపై ఎన్నికల కమిసన్ చర్య తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

వైసిపి ప్రస్థానం ఒక చరిత్ర

వైసిపి ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గడిచిన గత 12 ఏళ్ళ వైసిపి ప్రస్థానం ఒక చరిత్ర అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బివై. రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి. మోహన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ పరిశీలకులు మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య అన్నారు. ఆదివారం వైసిపి 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి బివై. రామయ్య, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాజకీయాల్లో వైసిపి ఒక సంచలన పార్టీ అని, తండ్రి మరణం తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో వైఎస్.జగన్ రాజకీయంగా నాడు తీసుకున్న నిర్ణయం నేడు కోట్లాది మందికి నీడగా నిలిచిందన్నారు. తల్లితో కలిసి ప్రారంభించిన రాజకీయ యాత్రలో లక్షలాది మంది కలిసొచ్చారని గుర్తు చేశారు. కేవలం ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాలతో ప్రారంభమైన వైసీపీ ప్రస్థానం రికార్డు స్థాయి విజయంతో సీఎం స్థానం అందుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో 175 ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకుని ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో మరో రికార్డు సృష్టిస్తామని ధీమా వ్యక్తంచేశారు.



కేక్ కట్ చేస్తున్న మేయర్ బివై.రామయ్య, వైసిపి నాయకులు



కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు బెల్లం మహేశ్వర రెడ్డి, వంగాల భరత్ రెడ్డి, మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ గాజుల శ్వేత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. యూనూస్ బాషా, కటారి సురేష్, శ్రీను, కిషన్ బిసి. సెల్ నాయకులు దేవుపూజ ధనుంజయ ఆచారి, బంగారు రాజశేఖర్, సత్యం, బత్తుల లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన : ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హాఫీజ్ ఖాన్ అన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతకి గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా సచివాలయ ఉద్యోగాలు, వైద్య ఆరోగ్యశాఖ అత్యధికంగా నియమకాలు వివిధ శాఖలలో నియమకాలు చేపట్టి ఈ ప్రభుత్వం అందరి భావనతో అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తికరంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు ముఖ్య నాయకులు, కో -ఆప్షన్ మెంబర్లు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

15న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సర్వేంద్రియానం నయనం ప్రధానంగా భావించి డాక్టర్ సుధాకర్ సుశీల నేత్రాలయం సహకారంతో ఈనెల 15న ఉదయం 8 గంటల నుండి మద్దూరు నగర్ పార్కులో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెజి.గంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరి, శ్రీదత్త మహిళా ఐక్య సంఘాలు, పొదుపు లక్ష్మి గ్రూపులు 24 వ వార్డు లక్ష్మీ నగర్ వారి సహాయ సహకారాలతో శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తామని తెలి పారు. కంటి అద్దాలు కేవలం రూ.200లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని ప్రజలు, లక్ష్మీ నగర్ ప్రాంత వాసులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ : మహిళ దినోత్సవం సందర్భంగా పది రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మహిళలకు ఉచిత హోమీయో వైద్య శిబిరం నిర్వహించారు. యువతకు తాడు లాగుడు పందేం , స్పీడ్ వాక్ , స్కిప్పింగ్ రోప్‌లను నిర్వహించారు. లైఫ్ లైన్ హోమియో వైద్య లు డాక్టర్ కుమారి చందన మహిళలకు వైద్యం చేసి ఉచితం గా హోమీయో మందులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ , చీఫ్ కోచ్ నటరాజ రావు, గోపాల కృష్ణ , మేనేజర్ శ్యామల పలువురు డ్రిల్ మాస్టర్లు పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు.



భౌతిక కాయాన్ని శ్మశాన వాటికకు మోసుకెళ్తున్న స్థానికులు

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో గత కొంతకాలం నుండి రాజు లక్ష్మి దంపతులు సాంఘిక సంక్షేమ పాఠశాల దగ్గర నివాసం ఉంటున్నారు. చిత్తు కాగితాలు ఏరుకుని వాటితో వచ్చిన డబ్బుతో జీవనం గడుపుతున్నారు. శనివారం రాత్రి యధావిధిగా పని ముగించుకొని వచ్చారు. నిద్రలోనే రాజు(35)మతి చెందారని భార్య లక్ష్మి కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే గ్రామ వైసిపి నాయకులు ఆముదాల నాగప్ప, యువ స్పందన సొసైటీ సభ్యులు రమేష్ మృతి దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజుమృత దేహానికి స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మికి ఆర్థిక సహాయం అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తండా హనుమంతు, భీమన్న, ఆంజనేయులు, రాముడు నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- సి బెళగల్ : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు ఆదివారం పూర్తయ్యాయి. నిర్వహణ అధికారులు టీచర్స్ సెక్షన్ ఎ.వెంకటేశ్వర్లు ఎపిఒ తేజేశ్వరి, ఒపిఒ శ్రీనివాసులు, పట్టభద్రుల సెక్షన్ నుండి ఎఒ సోమప్ప, ఎపిఒ యుగంధర్, ఒపిఒ లు జ్యోతి, హుస్సేన్ అక్బర్ లు మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకువాలని ఓటర్లకు సూచించారు. ఎంచుకున్న అభ్యర్థులకు నంబర్లు రాసి బాక్సులో వేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎస్సై పీరయ్య లు బూతులను పరశీలించారు.

స్లిప్పులు అందకుంటే ఆధార్,విద్యార్హతల పత్రాలు తెచ్చుకోవాలి

ఓటర్లకు స్లిప్పులు అందకుంటే ఆధార్ కార్డు, విద్యార్హత జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్ పేర్కొన్నారు.

ఫార్మాప్రీమియర్ లీగ్ సీజన్2లో డెక్కన్ వారియర్స్ విజేత

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ :



ఫార్మా ప్రీమి యర్ లీగ్ సీజన్ 2 లో డెక్కన్ వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా మైపర్ క్రికెట్ అకాడమీ మైదానంలో నిర్వహించిన ఫార్మా ప్రీమియర్ లీగ్ సీజన్ 2 లో డెక్కన్ వారి యర్స్ రాకింగ్ స్టార్‌టీం పై గెలిచి విజేతగా నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కె. సురేష్ బహు మతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌కు సహకరించిన మైపర్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్‌కు, గ్రౌండ్ఇన్చార్జి సమీర్‌కు ధన్యవాదాలు తెలిపారు.


నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో పోలింగ్ బూత్‌ను పరిశీలించిన డిఎస్‌పి


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సిఐ మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణు గోపాల్ రాజు

ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని ఆదోని డిఎస్‌పి వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను డిఎస్‌పి పరిశీలించారు. భారీ కేడ్లు ఏర్పాటు బ్యాలెట్ బాక్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడారు.

ఏఎస్పీ, డిఎస్పీలు ఇద్దరూ, సర్కిల్ ఇన్స్పెక్టర్లు 11, సబ్ ఇన్స్పెక్టర్లు 23, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు నలుగురు, హెడ్ కానిస్టేబుల్ 73, పోలీస్ కానిస్టేబుల్ 169, ఏఆర్ కానిస్టేబుల్‌లు 43, హోం గార్డులు 36, మహిళ పోలీసులు పది మంది విధుల్లో ఉంటారన్నారు. ఆదోని సబ్ డివిజన్ ఏరియాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు నిఘా ఉంచుతా మన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ చంద్ర, పోలీసులు ఉన్నారు.

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలి

గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మోహన్ రెడ్డి, మండల తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలో 1516 గ్రాడ్యుయేట్ 46 ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయి. వీరందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు పట్టభద్రులకు, ఒక ఉపాధ్యాయ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడి లాంటి ఏదో ఒక గుర్తింపు పత్రాన్ని తప్పకుండా తీసుకొని రావాలని అధికారులు తెలిపారు. గోనెగండ్ల సమస్యాత్మక పోలింగ్ కేంద్రం అయినందువలన గ్రామం మొత్తము 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిఐ మోహన్ రెడ్డి, ఎస్సై తిమ్మారెడ్డి తెలిపారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా 25 మంది పోలీసులు, ఇద్దరు ఏఎస్ఐలతో బందోబస్తును స్వయంగా పర్యవేక్షిం చనున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రాలయం : ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహిస్తున్నట్లు సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణు గోపాల్ రాజు పేర్కొన్నారు.

ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలోని రెండు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ దేవా చంద్రశేఖర్ తో కలిసి పరిశీలించి పోలింగ్ ఆఫీసర్‌లను కలుసుకుని పిఎస్‌లో ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల, 8 మంది పోలీసులు, ఇద్దరు హోంగార్డులతో మొత్తం 15 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. 253 పోలింగ్ కేంద్రానికి పోలింగ్ ఆఫీసర్‌గా వరప్రసాద్, 4 సిబ్బందితో 130 పోలింగ్ కేంద్రానికి పోలింగ్ ఆఫీసర్‌గా హనుమంతరావు ముగ్గురు సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ మొదలై సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- నిర్వహణకు ప్రజలు సహకరించండి
-సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూలులో ఎన్నికలకు విధులు నిర్వహించే ఏపీఓలకు, పిఓలకు శిక్షణ అనంతరం సబ్ కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్, రూట్ బస్సులను తనిఖీ చేసి పరిశీలిం చారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్ వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో 28 పీఓలు, 28 ఏపీఎంలు, 58 ఓపిఓలు, 28 మైక్రో అబ్జర్వర్లు, 6 జోనల్ ఆఫర్స్, 6 రూట్ ఆఫీసర్స్, 29 వెబ్ కాస్టింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు.

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహణ ఉంటుందన్నారు పోలింగ్ ఏజెంట్లు మినహా ఇతరులకు ప్రవేశం కల్పించరా దన్నారు. పోలింగ్ ముగిగానే అందరి సమక్షంలోనే బ్యాలెట్ బాక్స్‌కు సీలు వేయాలని ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రమణ, కాంత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- వామపక్ష పార్టీల నేతలు భాస్కర్ యాదవ్, జయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి అమూల్యమైన ఓటుతో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వామపక్ష పార్టీలైన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, సిపిఎం మండల కార్యదర్శి హెచ్. జయరాజు కోరారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. నేడు జరిగే శాసన మండలి ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రెండవ ప్రాధాన్యత ఓటును టిడిపి మద్దతుదారులైన పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. జరిగే శాసనమండల ఎన్నికలు చాలా ముఖ్యమై నవని శాసన మండలంకి ఒక మంచి వ్యక్తిని గెలిపించుకొని ప్రజాస్వా మ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పట్టభద్రులందరూ ఆలోచించి ఓటు వేయాలని ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండగా పోరాట పటిమ కలిగిన వ్యక్తులను పోతుల నాగరాజును, కత్తి నరసింహారెడ్డిలని గెలిపించాలని వారు కోరారు. ఓటరు జాబితాలో 30 శాతం నకిలీ ఓట్లు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బి. అనిలు, డి. ఆంధ్రయ, సిపిఐ నాయకులు లక్ష్మణ్ నాయక్, థామస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాస్కర్ యాదవ్, జయరాజు, తదితరులు


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం నియోజకర్గ ఇన్చార్జి జయ మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహి ంచారు. నేటికీ 13వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా వైఎస్ రాజ శేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జయ మనోజ్ రెడ్డి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ వైసిపి అని అన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

ఆదోనిలో దాదాపు రూ.100 కోట్లతో 750 నుంచి 1000 మంది దాకా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే వై సాయి ప్రసాద్ రెడ్డి రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బి దేవా,మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, సింహం నాగేంద్ర, మధుసూదన్ శర్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లు తగు జాగ్రత్తలు పాటించాలి : సబ్ కలెక్టర్


వివరాలు వెల్లడించిన సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లో ఓటర్లు తగు జాగ్రత్తలు పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో పత్రిక ముఖంగా పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన ఏదైనా ఓటరు గుర్తింపు కార్డును ఓటర్లు తీసుకువెళ్ళాలన్నారు. పోలింగ్ బూత్ల ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలన్నారు. బ్యాలెట్ పేపరుపై గుర్తులు వుండవని, పోటీలో వున్న అభ్యర్థుల పేర్లు మాత్రమే వుంటాయన్నారు. అభ్యర్థి పేరుకు ఎదురుగా వున్న గడిలో అనుకున్న నెంబరు వేయాలన్నారు. హిందూ అరబిక్ సంఖ్యలు 1,2,3,4,5 తరహాలోనే వేయాలన్నారు. తెలుగు అంకెలు, రోమన్ అంకెలు వాడితే ఓటు చెల్లదని ఓటర్లు గమనించాలన్నారు. అక్షరాలలో వ్రాసిన ఓటు చెల్లదని ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. ఓటుపై సంతకాలు చేయడం, నిరసనలు తెలియచేయడం చేసిన ఓటు చెల్లుబాటు కాదన్నారు. 1 తప్పని సరిగా వేయాలి, తరువాత వేయకపోయినా పరవాలేదన్నారు. 1 వేయకుండా 2,3 వేస్తే ఆ ఓటు చెల్లదని వివరించారు. రెండు పేర్లకు మధ్యలో సంఖ్య వేస్తే చెల్లదని,ఎదురుగా వేయాలన్నారు. ఒకే అంకె ఇద్దరికి వేసిన ఓటు చెల్లదన్నారు. బ్యాలెట్ పేపర్లో ఏ ఒక్కరికి సంఖ్య గుర్తించకపోయినా ఆ ఓటు చెల్లదని ఓటర్లు తప్పనిసరిగా నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.


సమావేశంలో మాట్లాడిన నాయకులు

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపాలిటీ పరిధిలోని మండగిరి మున్సిపల్ కాలనీలో వెలిసిన శ్రీమాతా పరమేశ్వరి దేవాలయం నూతన కమిటీని ఆదివారం ఎంఎం కాలనీ కుల పెద్దలు, యువకుల సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవా ధ్యక్షులుగా డి సుబ్బన్న, అధ్యక్షులుగా జి రంగస్వామి, ఉపాధ్యక్షులుగా యు చంద్రయ్య, జనరల్ సెక్రటరీగా దండోరా కొండయ్య, జాయింట్ సెక్రటరీగా జి రామకృష్ణ, ట్రెజరర్‌గా అంపాల వెంకటేశులు, జాయిం ట్ ట్రెజరర్‌గా జి రామయ్య, లవ కుమార్, మాధవ్, మురళి, చీఫ్ అడ్వైజర్లుగా హరినాథ్, వాసు, కుమార్, మస్తాన్, బాలాజీ, టిసి వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చిన్న, మనోజ్, రాజా, తిరుమ లేష్, మనోజ్, అబ్బాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నరసిం హులు, మారెప్ప, బీసీ సుబ్బరాయుడు, యు శ్రీనివాసులు(రెడ్డి), యూపీ శంకర్, రఘునాథ్, కళ్యాణ్, లోకేష్, జి లక్ష్మయ్య, సూరిలను ఎన్నుకు న్నారు. దేవాలయాభివృద్ధికి కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

పట్ట ణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాల యంలో కర్నూలు కిమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని విహెచ్‌పి కార్యదర్శి నారాయణ సింగ్ తెలిపారు. సుమారుగా 250 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 3డీ-ఏకో వంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాకస్ పరీక్షల్లో వాగ్దేవి స్కూలు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మల్లిఖార్జున విద్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి అబాకస్ పరీక్షల్లో వాగ్దేవి స్కూల్‌కి చెందిన ఒకటవ తరగతి విద్యార్థిని జీడి అనిత ఫస్ట్ క్లాస్ విభాగంలో ప్రతిభ కనబరచి రెండవ స్థానంలో నిలిచిందని కరెస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలు విద్యార్థులు మానిసికంగా బలపడేందుకు దోహదపడతాయన్నారు. ప్రతిభ చూపిన అనితకు, తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులకు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.


చిన్నారి విద్యార్థినికి ప్రశంస పత్రంతో అభినందించిన దృశ్యం

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల జోనల్ అధికారి సునీత

ప్రజాశక్తి-ఆలూరు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల జోనల్ అధికారి సునీత ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీచర్స్,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు. స్థానిక జూనియర్ కళాశాల లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.టీచర్స్ స్థానానికి 445 ఓట్లు,పట్టభద్రుల ఓట్లు 1175 ఉన్నాయన్నారు.

బైక్ అదుపు తప్పి విద్యుత్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు పట్టణ శివారున ఉన్న నూతన ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణ సమీపంలో విద్యుత్ ఉద్యోగి మారుతి రావు (50) బైక్ అదుపు తప్పి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో యుడిసిగా విధులు నిర్వహించే మారుతిరావు సహ ఉద్యోగుల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఆదోని ఇంటికి బయలు దేరాడు. ఆలూరు శివారులో ఉన్న అంజనేయస్వమి నూతన విగ్రహ నిర్మాణం ఆవరణలో జాతీయరహదారిపై అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య అనురాధ, కొడుకు,కూతురు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


జడ్జికి చిత్ర పటాని ఇస్తున్న శ్రీమఠం పీఠాధిపతులు

శ్రీ మఠంలో తెలంగాణ హైకోర్టు జడ్జి నవీన్ రావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జీ నవీన్ రావు ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు సుభుదేంధ్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం ఫల మంత్రాక్ష తలు మెమోంటో అందజేసి ఆశీర్వదించారు.

జయరాజుకు ఉత్తమ పాత్రికేయ అవార్డు



ప్రజాశక్తి - మంత్రాలయం

ఆంధ్రజ్యోతి విలేకరిగా సేవలు అందించిన వగరూరు జయరాజు ఉత్తమ పాత్రికేయులుగా అవార్డు అందుకున్నారు. రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీ సుయతీంద్ర తీర్థుల సమారాధన సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంధ్రతీర్థులు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి సుయతీంద్ర తీర్థుల ప్రశస్తి-2023 అవార్డులకు ఎంపిక చేశారు. ఆదివారం రాత్రి శ్రీ మఠం యాగశాలలో ప్రత్యేక వేదికపై ఉత్తమ విలేకరిగా గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ తాలుకా ప్రధాన కార్యదర్శి, మంత్రాలయం ఆంధ్రజ్యోతి విలేకరి వగరూరు జయరాజుకు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధ్యేంద్ర తీర్థులు తమ స్వహస్తాలతో శ్రీ సుయతీంద్ర తీర్థుల అవార్డుతో జ్ఞాపికను, నగదు, పట్టు శాలువాతో వెండి గిన్నె, ప్రశంస పత్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసా దం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత జయ రాజు మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తు న్నానని అన్నారు. అనంతరం మంత్రాలయం ఏపియు డబ్ల్యూజే మండల, తాలూకా కమిటీ నాయకులు అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో గయ రామాచార్, మఠం ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రి నాథ్, సిఆర్వోలు రవికులకర్ణి, విజయేంధ్ర ఆచార్, అనంత పురాణిక్, డియం ఆనందరావు, వాదిరాజ ఆచార్, ద్వారపా లక అనంతస్వామి, వ్యాసరాజ ఆచార్, ప్రకాష్ ఆచార్, బిందు మాధవ్, వాజేంద్ర ఆచార్, మంత్రా లయం సిఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, వెంకటేశులు, ఏయస్ఐ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ మంత్రాలయ నిర్మాత సుయతీంద్ర తీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు సుయతీంద్ర తీర్థులు స్వర్ణ మంత్రాలయ నిర్మాతగా ప్రసిద్ధి చెందారని శ్రీ మఠం పీఠాధిపతులు సుభుదేంధ్రతీర్థులు పేర్కొ న్నారు. ఆదివారం సుయతీంద్ర తీర్థుల మధ్యారాధన సందర్భంగా పదవ సమారాధనను పురస్కరించుకుని పీఠాధిపతులు సుభుదేంధ్రతీర్థులు ఊయల మండపంలో ఆయన చిత్రపటాన్ని స్వర్ణ పీఠంపై ఉంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిచే రాఘవేంద్రులుగా పేరుగాంచిన పరమ గురువుగారైన సుశమీంద్రతీర్థుల ద్వారా 2006లో ఉత్తరాధికారిగా పీఠం స్వీకరించిన తమ గురువుగారైన సుయతీంద్ర తీర్థులు యథార్థవాదిగా సౌమ్యులుగా శ్రీ మఠం అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. వేయి మందికి పైగా ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించారని అన్నారు. తుంగభద్ర నది వరద అనంతరం దాతల సహకారంతో స్వర్ణ మంత్రాలయంగా తీర్చిదిద్దారని కొనియాడారు. 2012లో ఆయన ద్వారా తనకు ఉత్తరాధికారిగా పట్టాభి షేకము లభించిందని ఆయన అడుగు జాడల్లో నడుస్తూ శ్రీ మఠం అభి వృద్ధిలో పాలు పంచుకుంటూ భక్తుల సేవలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీ సుయతీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు సుయతీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుయతీంద్ర తీర్థుల మధ్యారాధన సందర్భంగా పదవ సమారాధనను పురస్కరించుకుని ప్రస్తుత పీఠాధిపతులు సుభుదేం ధ్రతీర్థుల ఆధ్వర్యంలో సుయతీంద్ర తీర్థుల ఆరాధన కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సుయతీంద్ర తీర్థుల చిత్ర పటాన్ని స్వర్ణ రథోత్సవంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంధ్ర తీర్థులు పుష్పాభిషేకంతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం స్వర్ణ రథోత్సవాన్ని మేళ తాళా లు మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ మఠం ప్రాకా రంలో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు యస్కే శ్రీనివా స రావు, వెంకటేష, జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, సహాయక పిఆర్వో హెబ్బొళ్ళి వ్యాస రాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ఇతర మఠం సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంధ్రతీర్థులు


హారతి ఇస్తున్న సుభుదేంధ్రతీర్థులు



నేడు మండలి పోరు

- ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్



ఉయ్యాలవాడకు పోలింగ్ సామగ్రితో చేరుకున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మండలి పోరుకు నంద్యాల జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ నిర్వహించనున్నారు....

జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగనుంది. నంద్యాల జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 61 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 30 పోలింగ్ కేంద్రాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కలిపి 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 54,929 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 4426 మంది, స్థానిక సంస్థల ఓటర్లు 578 మంది ఉన్నారు. నంద్యాల జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కలిపి 473 మంది పోలింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు 118 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 56 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ కూడా ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. బందోబస్తు కోసం 590 మంది పోలీసులను నియమించారు.

కౌటింగ్ కేంద్రాలు ఇలా...

స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరగనుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్‌ను అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో నిర్వహించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు నడుమ అనంతపురం కౌంటింగ్ సెంటర్‌కు పంపనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నారు.

అందుబాటు ధరలో

రవాణా సౌకర్యం

- ఇంటి వద్దకే డెలివరీ సేవలు
- పార్శిల్ వస్తువులకు భరోసా
- ప్రజాశక్తితో ఆర్‌టిసి కార్గో ఎటిఎం పి.ధనమ్మ



ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

"ఎపిఎస్‌ఆర్‌టిసి సరుకుల రవాణా ప్రారంభించి పార్శిల్, కొరియర్ సేవలతో రాష్ట్రంలో ప్రజాదరణ పొందింది. రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ప్రతి నెల 5 లక్షల పైబడి పార్శిల్‌లను 24 గంటల్లో రవాణా చేస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్న ఆర్‌టిసి మరో ముందడుగు వేసి డోర్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. ఇంటి వద్దకే పార్శిల్‌లను డెలివరీ చేస్తున్నాం. అందుబాటు ధరలో పార్శిల్ సేవలను అందించడంతో పాటు పార్శిల్‌లకు భరోసా అందిస్తున్నాం..' అని ఆర్‌టిసి కార్గో కర్నూలు ఎటిఎం పి.ధనమ్మ తెలిపారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

మీరు ఎక్కడి నుండి బదిలీపై వచ్చారు..?

ఎటిఎం : పశ్చిమగోదావరి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ గ్రేడ్ 2గా పని చేస్తూ తణుకు నుండి బదిలీపై జనవరి 27న వచ్చి చేరాను.

కార్గో సేవలు ఎప్పటి నుండి ప్రారంభించారు..?

ఎటిఎం : ఎపిఎస్ ఆర్‌టిసి 2019 నుండి కార్గో సేవలను ప్రారంభించింది.

ఏ వస్తువులను కార్గో ద్వారా రవాణా చేస్తారు..?

ఎటిఎం : 50 కేజీల బరువు గల పార్సిల్ పది కిలోమీటర్ల లోపు డోర్ డెలివరీ చేస్తాం. అలాగే ఒక టన్ను వరకు టాప్ పైన గానీ డిక్కీలో గానీ వస్తువులు రవాణా చేయబడును. వెయ్యి టన్నుల సరుకు ఉన్నట్లయితే గూడ్స్ ద్వారా రవాణా చేస్తాం. వినియోగదారులు పార్సిల్‌లో బుక్ చేసేటప్పుడు బుకింగ్ ఛార్జీలతోపాటు డోర్ డెలివరీ చార్జీలు కూడా చెల్లించి పార్సెల్ పొందువారి చిరునామా, ఫోన్ నంబరు, పిన్‌కోడ్, డోర్ నంబర్ల వివరాలు తెలియజేసి డోర్ డెలివరీ సదుపాయము పొందవచ్చు.

కార్గోను ఎవరు నిర్వహిస్తున్నారు..?

ఎటిఎం : వస్తువుల రవాణా, నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పడం జరిగింది. 24/7 గంటలు వస్తువుల రవాణా చేసేందుకు ఆ సంస్థ 20 మందిని, కావలసిన కంప్యూటర్లు ఇతర సామాగ్రి సమకూర్చి బుకింగ్ చేసే వారిని నియమిస్తారు.

ప్రతి రోజు ఎన్ని బుకింగ్ జరుగుతున్నాయి..?

ఎటిఎం : ప్రతిరోజు మూడు కౌంటర్ల ద్వారా మూడు షిఫ్టులలో 600 బుకింగ్‌లు చేయబడుతున్నాయి. రోజుకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.

కార్గో ద్వారా వస్తువుల రవాణా మార్కెటింగ్ చేసేందుకు ఎవరైనా ఉన్నారా..?

ఎటిఎం : వస్తువుల మార్కెటింగ్ చేసేందుకు రంగన్న అనే వ్యక్తి ఉన్నాడు. ఇతను కంపెనీలతో సత్సంబంధాలు కలిగి వారి వస్తువులను కార్గో ద్వారా పంపడానికి కృషి చేస్తుంటాడు.

పార్సిల్‌లను, కవర్లను ఏఏ ప్రాంతాలకు పంపిస్తారు..?

ఎటిఎం : బస్సులలో పార్సిల్‌లను, కవర్లను తెలంగాణలోని హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్లోని 85 ప్రధాన పట్టణాలకు 24 గంటల్లోపు చేరుస్తాం, ప్రాంత దూరాన్ని బట్టి ఛార్జీలు వసూలు చేస్తాం.

కార్గోలో పనిచేసేవారు బుకింగ్ చేసిన డబ్బులు వాడుకుంటున్నారని సమాచారం. అందుకు మీ సమాధానం ఏమిటి..?

ఎటిఎం : బుకింగ్ చేసిన డబ్బులు కంప్యూటరీకరణ చేయబడి ఉంటుంది. కాబట్టి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు అంతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఎవరు డబ్బులు వాడుకోవడానికి వీలుండదు.

ఇక్కడ పనిచేసే వారికి ఏ నెలకి ఆ నెల జీతాలు ఇవ్వకపోడం ద్వారా మానుకొని పోతున్నారని, ఐదు నెలలు పని చేస్తే రెండు నెలల జీతాలు మాత్రమే ఇస్తున్నారని తెలిసింది. దీనికి మీ సమాధానం ఏమిటి..?

ఎటిఎం : కార్మికులకు అన్యాయం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకొని వారికి న్యాయం చేస్తాం.

2022-2023 సంవత్సరానికి కార్గో ద్వారా వచ్చిన ఆదాయం ఎంత..?

ఎటిఎం : 2022 ఏప్రిల్ నుండి 2023 జనవరి వరకు రూ.642.12 కోట్లు టార్గెట్ కాగా జనవరి నాటికి రూ.419.82 కోట్లు టార్గెట్‌ను చేరుకున్నాము.



ప్రలోభాలు



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బు పంపిణీ
- విబేధాలు.. బయటపడుతున్న వైనం..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/పగిడ్యాల

అధికార వైసిపి నాయకులు ప్రలోభాల పర్వానికి తెరలేపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు పంపిణీని గుట్టు చప్పుడు కాకుండా చేద్దామనుకున్నారు. పంపిణీలో విబేధాలు రావడంతో ఈ విషయం బట్టబయలైంది...

అధికార పక్ష వైసిపి నాయకులు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ఓడిపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత బయటపడుతుందని భావిస్తున్నారు. దీంతో తమ అభ్యర్థుల గెలుపు కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం పోలింగ్ కావడం, శనివారం సాయంత్రానికి ప్రచారం ముగియడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ ప్రలోభాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగించారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నాయకుల ద్వారా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. అయితే డబ్బుల పంపిణీ దగ్గర విబేధాలు రావడంతో ఈ వ్యవహారం బయటపడింది. పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో అధికార వైసిపిలో గత సార్వత్రిక ఎన్నికల నుంచి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ రెండు గ్రూపులు ఉన్నాయి. లక్ష్మాపురంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ గ్రూపులోనే మరో మూడు గ్రూపులు ఏర్పడ్డాయి. లక్ష్మాపురంలో ఆధిపత్యం కోసం నువ్వా నేనా అంటూ పోటీ పడుతున్నారు. దీంతో లక్ష్మాపురం గ్రామంలో అధికార వైసిపిలో నాలుగు గ్రూపులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రానికి ముగియడంతో రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మాపురంలో డబ్బుల పంపిణీకి వైసిపి నాయకులు సిద్ధమయ్యారు. లక్ష్మాపురంలో మొత్తం 62 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఒక్కొక్క ఓటరుకు రూ.వెయ్యి పంపిణీ చేస్తున్న సమయంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గ్రూపునకు చెందిన నాయకులు తాను పంపిణీ చేయాలంటే తాను చేయాలంటూ ఘర్షణకు దిగారు. నాయకులు మూడు గ్రూపులుగా చీలిపోయి ఒకరినొకరు దూషించుకుంటూ ఘర్షణకు దిగారు. గ్రామ ప్రజలు అధికార పార్టీకి చెందిన వారే ఘర్షణ పడుతుండడంతో చూసి అవాక్కయ్యారు. పగిడ్యాల మండలంలో మొత్తం 1256 పట్టభద్రుల ఓటర్లు, 77 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఓటర్లకు రూ.వెయ్యి, ఉపాధ్యాయ ఓటర్లకు రూ.3 వేల నుంచి 5 వేలు పంపిణీ చేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి డబ్బు పంపిణీ చేస్తున్నట్లు స్థానిక పోలీసులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరించడం శోచనీయం. ఇలా చాలా వరకూ గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ గ్రామ స్థాయి నాయకుల ద్వారా పంపిణీ పర్వాన్ని చేపట్టారు. ఈ వ్యవహారంపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరుగు పోలీసు స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎస్పి కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం పోలీసు స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.



జెసిబితో తిప్పను తవ్వుతున్న దృశ్యం

కరుగుతున్న తువ్వపల్లె తిప్ప

- అక్రమంగా మట్టి తవ్వకాలు
- కనుమరుగవుతున్న సహజ సిద్ధ తిప్పలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల కేంద్రం సమీపాన తువ్వపల్లె తిప్పపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. జెసిబిల సహాయంతో ఆ తిప్పను తవ్వి ట్రాక్టర్ల సహాయంతో ఎర్రమట్టి రాయిని పక్క మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ ఏమి తెలియనట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. భారీ స్థాయిలో ముడుపులు పుచ్చుకున్నారని, అందుకే చూసీ చూడనట్లు అధికారులు ఉన్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రుద్రవరం సమీపంలోని తువ్వపల్లి తిప్ప సహజ సిద్ధంగా కొన్ని వందల ఏళ్ల క్రితం ఏర్పడింది. ఈ తిప్ప ఎంతోమందికి ఉపాధి నిచ్చింది. అంతేకాకుండా పచ్చిక బయలతో తిప్పపై ఎన్నో ఔషధ మొక్కలు, పండ్ల మొక్కలతో నిండి ఉన్న తిప్పను కొందరు భూ బకాసురులు ధనార్జనే ధ్యేయంగా తిప్పపై ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరుపుతూ నామరూపాలు లేకుండా చేస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన తిప్పను ఇలా అక్రమ మట్టి కోసం నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ఆదివారం దాదాపు 30 ట్రాక్టర్లతో జెసిబిల సహాయంతో మట్టిని పక్క మండలాలకు తరలించారు. తిప్ప కనుమరుగు కాకముందే ఉన్నతాధికారులు మేల్కొని భూ బకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తిప్పపై ఉన్న ఎర్రమట్టిని తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లు

పోలింగ్ సజావుగా జరపాలి : కలెక్టర్

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, అత్యంత చురుకుగా వ్యవహరించి సజావుగా జరపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పోలింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న పోలింగ్ సామాగ్రి, వెళ్తున్న సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండి ఓటింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపేందుకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్‌తో పాటు అన్ని రకాల ధృవపత్రాలను తీసుకున్నారా, లేదా తదితర వివరాలను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో జంబో బ్యాలెట్ బాక్సులు అమర్చే విధానంతో పాటు పోలింగ్ సిబ్బంది వెళుతున్న దృశ్యాలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నుంచి జిల్లా వ్యాప్తంగా మూడు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల్లో చేస్తున్న ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. అలాగే నోడల్ అధికారులందరూ కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను కంట్రోలు రూము నుంచి పర్యవేక్షించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, నోడల్ అధికారులు కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షిస్తున్నారు.



పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

20న చలో విజయవాడ

- జయప్రదం చేయండి : కె.భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.భాస్కర్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు డి మదార్ బి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు రకరకాల యాప్‌లు డౌన్లోడ్ చేసుకోవాలని, లబ్ధిదారులతో బయోమెట్రిక్ వేయించాలని లేకపోతే వేతనాలను కట్ చేస్తామని కిందిస్థాయి అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు. అంగన్వాడీలకు 2017లో నాసిరకం సెల్ ఫోన్స్ ఇచ్చారని, అవి 90 శాతం దెబ్బతిన్నాయని, కొన్ని గ్రామాలలో, ఏజెన్సీ ప్రాంతాలలో ఇంటర్‌నెట్ సౌకర్యం లేదని, యాపులు డౌన్లోడ్ చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాడైన ఫోన్లకు అంగన్వాడీలు డబ్బులు పెట్టి బాగు చేయించుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు సొంతంగా సెల్ ఫోన్లు కొనుక్కొని పనులు చేస్తున్నారని, లేని వారు ఇబ్బందులు పడుతూ మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు ఫోన్లు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, జగనన్న సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పరిరక్షణ పేరుతో అధికార వేధింపులు మానుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి టి.వేణుగోపాల్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృసిద్ధిబి, ప్రసన్న, వెంకట రమణమ్మ, శైలజ, సుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీ కుమారి స్వాతి, నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిడిపిఒ కోటేశ్వరమ్మ అనుమతి పత్రం అందజేశారు.



అనుమతి కోరుతూ పత్రం అందజేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న యాదాటి నాగేంద్రుడు

నోటుకు ఓటును అమ్ముకోవద్దు : సిపిఎం

ప్రజాశక్తి - వెలుగోడు

నోటుకు ఓటును అమ్ముకోవడం అంటే ఆత్మ గౌరవాన్ని అమ్ముకోవడమేనని సిపిఎం మండల నాయకులు యాదాటి నాగేంద్రుడు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మన నమ్మకాన్ని వమ్ము చేయక మనకోసం నిలబడే నైజం, నిరంతరం సమాజం బాగుండాలని బలంగా కోరుకునే నిత్య సామాజిక సృజనశీలి పోతుల నాగరాజు అని తెలిపారు. విద్యార్థి దశ నుండే సామాజిక దృక్పథంతో వివిధ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న సమర్థుడైన నాయకుడని అన్నారు. ధన బలం లేని ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి స్వచ్ఛ రాజకీయాల కోసం నిరంతరం పాటు పడుతున్న వ్యక్తి అన్నారు. సంవత్సరాల సర్వీస్ ఉన్న టీచర్ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకొని ప్రజాక్షేత్రమే తన ఊపిరిగా బతుకుతున్న ఓ సామాన్యుడని చెప్పారు. ఆత్మగౌరవం తల ఎత్తుకుని నిలబడేలా పోతుల నాగరాజు గెలిపించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో అవాజ్ కమిటీ నాయకులు మహమ్మద్ రఫీ, కెవిపిఎస్ నాయకులు రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు నాగమోహన్, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జ్ హనుమంతు పాల్గొన్నారు.

ఘనంగా భూమా నాగిరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలో దివంగత శాసనసభ్యులు భూమా నాగిరెడ్డి ఆరవ వర్ధంతి వేడుకలు ఆదివారం శోభ ఘాట్‌లో ఘనంగా జరిగాయి. ఆయన సమాధి వద్ద భూమా దంపతుల వారసులు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, తాలుకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, అఖిలప్రియ భర్త భార్గవరామ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, జగత్ విఖ్యాత్ రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్



బనగానపల్లె : బ్యాలెట్ బాక్సులను తీసుకువస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సువర్ణదేవి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బనగానపల్లె మండలంలో పట్టభద్రుల ఓట్లు 2949, ఉపాధ్యాయ ఓట్లు 343, అవుకు మండలంలో పట్టభద్రులు 1097, ఉపాధ్యాయులు 54, కొలిమిగుండ్ల మండలంలో పట్టభద్రులు 1021, ఉపాధ్యాయులు 66, కోవెలకుంట్ల మండలంలో 1685 పట్టభద్రులు, ఉపాధ్యాయులు 200, సంజామల మండలంలో పట్టభద్రులు 1022, ఉపాధ్యాయులు 47 ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపుగా ఉండరాదని, ఓటు వేసి వెళ్లాలన్నారు. ఓటర్లు స్లిప్పులతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డు, ఇతర గుర్తింపు కలిగిన కార్డులను తీసుకురావాలని సూచించారు. **పాములపాడు :** పాములపాడులోని జడ్పీహెచ్ హైస్కూల్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ రత్న రాధిక తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 951 మంది పట్టభద్రులు, 36 మంది ఉపాధ్యాయులు ఓట్లు ఉన్నాయన్నారు. ఆదివారం సాయంత్రానికి బ్యాలెట్ బాక్సులు పిఓ, ఏపిఓ, సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. **బండి ఆత్మకూర్ :** మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ ఉమారాణి తెలిపారు. ఎన్నికల సిబ్బంది బండి ఆత్మకూరు గ్రామానికి చేరుకున్నారని చెప్పారు. మండలంలో 1306 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఎస్సై బాబు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొలిమిగుండ్లలోని రెండు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్, ఎంపిడిఒ సుబ్బరాజు పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలింగ్ నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. మండలంలో మొత్తం 1021 మంది పట్టభద్రులు, 66 మంది టీచర్లు ఓటర్లుగా ఉన్నారని చెప్పారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఆళ్లగడ్డ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా మండలాల తహశీల్దార్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అన్ని సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. బ్యాలెట్ బాక్సులు, పేపర్ల పంపిణీ సజావుగా సాగింది. నియోజకవర్గంలో 7502 మంది పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓట్లు 509 మంది ఉన్నారు. ఆళ్లగడ్డ మండలంలో పట్టభద్రుల ఓట్లు 2692, ఉపాధ్యాయ ఓట్లు 246, సిరివెళ్ల మండలంలో పట్టభద్రులు 1313, ఉపాధ్యాయులు 68, చాగలమర్రి మండలంలో పట్టభద్రులు 1491, ఉపాధ్యాయులు 115, రుద్రవరం మండలంలో పట్టభద్రులు 789, ఉపాధ్యాయులు 39, ఉయ్యాలవాడ మండలంలో పట్టభద్రులు 687, ఉపాధ్యాయులు 21, దొర్నిపాడు మండలంలో పట్టభద్రులు 530, ఉపాధ్యాయులు 19 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. చాగలమర్రి, ఆళ్లగడ్డలో థర్డ్ జెండర్ ఓటు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఆళ్లగడ్డ మండలంలో పట్టభద్రులకు 4 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పోలీస్ అధికారులు తనిఖీ

పగిడ్యాల : పగిడ్యాల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను నందికొట్కూరు రూరల్ సిఐ సుధాకర్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, పోలింగ్ సమయంలో ఘర్షణలకు దిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నాగార్జున, వీఆర్ఓ నాగన్న, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీక్షపతి తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎస్సై ప్రతాప్ తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, తెలిపారు. విఆర్ఒ ఎరుకలయ్య, విఆర్ఏ రాముడు తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆళ్లగడ్డ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. విద్యుత్, నీటి సౌకర్యాలను పరిశీలించారు. ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ వివరించారు. ఆయన వెంట ఎస్ఐ రమణయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు. **మహానంది :** మ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ జనార్దన్ శెట్టి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. మండలంలో మొత్తం 897 మంది పట్టభద్రులు, 35 మంది టీచర్లు ఓటర్లుగా ఉన్నారన్నారు. **బేతంచర్ల :** బేతంచర్ల మండలంలో నేడు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో 2060 మంది పట్టభద్రుల ఓటర్లు, 97 మంది ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండల కేంద్రంలో మొత్తం 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు బేతంచెర్ల సిఐ ప్రియతమ రెడ్డి, తహశీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.



ఆళ్లగడ్డ : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది



పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయాధికారి కౌసల్య తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలో ఉన్న గ్రంథాలయంలో చిన్నారులకు ప్రత్యేకంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయానికి పెద్దలతో పాటు చిన్నారులు కూడా రావడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో లభించే పేపర్లు, కథల పుస్తకాలు చదవడం వల్ల చిన్నారులకు చదువుతోపాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం చిన్నారుల వినోదం కోసం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

రుద్రగుండం కోనేరు వద్ద పాము కలకలం

ప్రజాశక్తి - మహానంది

మహానంది దేవస్థానంలోని రుద్రగుండం కోనేరు వద్ద నాగుపాము కలకలం రేపిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. మహానంది దేవస్థానం పెద్ద కోనేరు (రుద్రగుండం) తూర్పు వైపు మెట్ల మార్గం ద్వారా పైకి చేరుకొని అక్కడ వుండే ఇనుప కిటికీలోని రంధ్రాలలో నాగుపాము వేలాడుతూ అక్కడి దేవస్థానం సిబ్బందికి, భక్తులకు తారసపడింది. ఈ విషయం దేవస్థానం అధికారులకి తెలియడంతో వారు వెంటనే పాములు పట్టే రాముడుకి సమాచారం అందించారు. అతను సంఘటన స్థలానికి చేరుకొని చాకచక్యంగా పామును పట్టుకొని సమీపంలోని అడవి ప్రాంతంలోకి వదిలిపెట్టారు. దీంతో దేవస్థానం అధికారులు, భక్తులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

బలిజలు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

బలిజలందరూ ఐక్యంగా మెలగాలని బలిజ సంఘం నాయకులు అర్జీగారి నరసింహుడు పేర్కొన్నారు. ఆదివారం ఉయ్యాలవాడలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి బలిజ సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బలిజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనకబడి పోయారని అన్నారు. బలిజల సమస్యల పరిష్కరించేందుకు గ్రామంలో నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. బలిజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కవతం చిన్న రాముడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బలిజ సంఘం నాయకులు

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాగలమర్రి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆళ్ళగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. విధులకు హాజరైన పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఒక డిఎస్‌పి, 4 సిఐలు, 10 మంది ఎస్ఐలు బూత్‌లను పర్యవేక్షిస్తారన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్ ఫోన్లు, అగ్గి పెట్టెలు, జల పదార్థాలు తీసుకెళ్లరాదన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఓటర్లను ప్రలోభ పెట్టడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి మురళి, ఎన్నికల అధికారి, తహసీల్దారు విజయ్ కుమార్, ఎంపిడిఒ చంద్రశేఖర్, సిఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ రమణయ్య, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎస్‌పి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 20 ఏళ్ల తరువాత కలిసిన స్నేహబంధం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం వడ్డేమాన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకుని తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి మధుర జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు, చేసే అల్లరి, స్నేహితుల కోసం చేసే ఫైటింగ్‌లు, వారితో కలిసి ఆడిన ఆటలు, చిన్న చిన్న గ్యాంగ్‌లు, అవన్నీ ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం మృతి చెందిన గురువులు, స్నేహితులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు ఫాతిమాభి, కొచ్చెరువు హెచ్‌ఎం మురళీధర్ రెడ్డి, సరస్వతి, సంపూర్ణ, కృష్ణమూర్తి, లైబ్రరీ శంకరయ్య, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు నల్లమల స్వాములు, సగినేల నాగరాజు, జగన్, కిరణ్, మునిస్వామి, రఘురామయ్య, సాంబశివుడు, దేవేంద్ర గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





చదువుతోపాటు ఆటపాటలు అవసరం

ప్రజాశక్తి - బేతంచెర్ల

విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసాన్నిచ్చే ఆటపాటలు కూడా ఎంతో అవసరమని సుమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కోఆర్డినేటర్ మహేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోనిసుమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చూర్ టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు పాల్గొని బెల్ట్ టెస్ట్‌లో గ్రీన్, ఎల్లో, బ్లూ బెల్టు సాధించారు.

అందుబాటులో పంట ముసాయిదా జాబితా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు రబీ 2022-23లో 4 లక్షల 8 వేల 499 ఎకరాలలో పంటల సాగుతోపాటు ఈ-పంట నమోదు పూర్తి అయినట్లు జిల్లా వ్యవసాయధికారి టి. మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఈ పంట ముసాయిదా జాబితాను పెట్టామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆర్‌బికెల్లో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజనుకి సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు సామాజిక తనఖీకి ప్రదర్శించబడుతుందని చెప్పారు. మార్పులు, చేర్పులు అనంతరం తుది జాబితాను ఈ నెల 20వ తేదీన ఆర్‌బికెల్లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

శానిటేషన్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో తొలగించిన శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట తొలగించిన శానిటేషన్ కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులను గత నెల ఫిబ్రవరి 15న ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే వీరిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు సుశీలమ్మ, వెంకట రమణమ్మ, నాగేంద్రమ్మ, సావిత్రి, గోవిందపల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

వార్డెన్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

విద్యార్థుల సమస్యలు గాలికి వదిలేసిన బొమ్మల సత్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం బొమ్మల సత్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మల సత్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు సక్రమంగా విధులకు హాజరుకాకుండా, విద్యార్థులకు పెట్టవలసిన మెనూను తారుమారు చేసి సొంత మెనూ ఏర్పాటు చేసి కడుపు కొడుతున్నారని అన్నారు. తక్షణమే జిల్లా సంక్షేమ శాఖ అధికారులు అయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అనేకసార్లు ఆయనపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యమేమిటోనని ప్రశ్నించారు. స్వయంగా విద్యార్థులే సమస్యలను వార్డెన్ వెంకటేశ్వర్లు పట్టించుకోవడం లేదని, మెనూ ప్రకారం ఆహారం పెట్టడం లేదని, గుడ్లు, అరటి పండ్లు ఇవ్వడం లేదని చెబుతున్నా జిల్లా సంక్షేమ శాఖ అధికారులు పటించుకోవడం లేదన్నారు. వార్డెన్ ఇచ్చిన ముడుపులకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఆశపడి చర్యలు తీసుకోకుండా వదిలేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. హాస్టల్‌లో ఇన్ని సమస్యలు ఉన్నా జిల్లా సంక్షేమ శాఖ అధికారులు మాత్రం అక్కడ ఏమీ సమస్యలు లేవని ఉన్నతధికారులకు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని అనేక ఉద్యమాలు చేసినా జిల్లా సంక్షేమ శాఖ అధికారి చింతామణి ఆయననే సపోర్ట్ చేస్తూ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈయనకు బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్, ఎస్టీ హాస్టల్ ఇన్‌చార్జి ఇవ్వడం ఎంతవరకు కరెక్టో చెప్పాలన్నారు. వెంటనే వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా డిడి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆధారాలతో సహా ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని, ఏ వార్డెన్ అయినా విద్యార్థుల కడుపు కొడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.



ఫ్యాన్లు అందజేస్తున్న ఎస్ఐ అశోక్

పాఠశాలకు ఫ్యాన్లు పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు జడ్పిహెచ్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థుల సౌర్యార్థం ఎస్ఐ అశోక్ ఫ్యాన్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. 30 ఏళ్ల కిందట పాఠశాలలో సరైన వసతులు, సౌకర్యాలు లేక ఎంతో కష్టపడి చదివే వారని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉంటున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువు, క్రీడలు, ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలకు ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎస్ఐ అశోక్‌కు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కేటాయించిన స్థల పరిమితిలోనే

వ్యాపారాలు నిర్వహించుకోవాలి : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానం పరిధిలో వ్యాపారస్తులకు కేటాయించిన స్థల పరిమితులలోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన సూచించారు. ఆదివారం దేవస్థానంలోని లలితాంబిక వాణిజ్య సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ కేటాయించిన దుకాణం పరిధి దాటి ముందుకు రావడం వలన పాదాచారులకు ఇబ్బంది ఏర్పడుతుందని సూచించారు. కేటాయించిన స్థల పరిమితి దాటి రహదారుల ఆక్రమణకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిరోజు సముదాయాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తూ ఉండాలని, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. దుకాణదారులు తమకు కేటాయించిన దుకాణాలను ఇతరులకు వ్యాపారం నిర్వహించుకునేందుకు లీజులకు ఇవ్వకూడదని సూచించారు. దుకాణదారులు ఎవరైనా లీజుకు ఇచ్చినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ విభాగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, రెవిన్యూ విభాగం పర్యవేక్షకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఇఒ లవన్న

'స్పందన' తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు జిల్లాలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు.

తండ్రి అడుగు జాడల్లో సిఎం జగన్ : ఎమ్మెల్యే

- ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

తండ్రి అడుగు జాడల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2011 మార్చి 12న ప్రజల మధ్య పుట్టిన పార్టీనే యువజన శ్రామిక రైతు పార్టీ వైఎస్ఆర్ పార్టీ ఆవిర్భావం చెందిందని చెప్పారు. నేటికీ వైసిపి 12 వసంతాలు పూర్తిచేసుకుని 13వ వసంతంలోకి అడిగిడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్, ఉమ్మడి జిల్లాల ఎంపిటిసి సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, భానుముక్కల పరపతి సంఘం అధ్యక్షుడు నీలి శ్రీనివాసులు, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, అంబటి రవి రెడ్డి, సైకిల్ షాప్ మహబూబ్ వలి, ఎవరెస్ట్ స్కూల్ బాబు, ఈసారి ఎల్లయ్య, వార్డు మెంబర్ కుమ్మరి సురేష్, దేవుడు, తిరుపాల్ గౌడ్, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రిన్స్ టైలర్ భాష, కటికవానికుంట మోహన్ రెడ్డి, గౌస్‌పీరా, పెద్దన్న అమీర్, గోరేసా, షాకీర్, బలిజ కృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు రామసుబ్బయ్య, బలిజ కిట్టు, అహమ్మద్ హుస్సేన్, సుబ్బరాయుడు గౌడ్, కైప మహేష్, మెకానిక్ హైదర్ నవాజ్, మీసేవ కృష్ణ, టైలర్ హుస్సేన్ సా ,ఆస్థాన సాజీద్ హుస్సేన్ ,పెద్దన్న, గౌండ మా భాష, గౌండ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం నంద్యాల ఎమ్మెల్యే నివాసంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, రాష్ట్ర ఎపి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు విజయ శేఖర్ రెడ్డి, సిద్ధం శివరం, లీగల్ సెల్ ప్రతాపరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైఎస్ర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.అలాగే పట్టణంలోని వృద్ధులకు, నిరాశ్రయులకు ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్ నారాయణరెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్లరబ్బానీ, రాష్ట్ర గిహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ సుకూర్, మున్సిపల్ కౌన్సిలర్ ఉండవల్లి ధర్మారెడ్డి, జిల్లా ఎస్‌సి విభాగం అధ్యక్షులు సగినేల వెంకటరమణ, జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ వైసిపి నాయకులు షేక్ బాబూలాల్, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రమేష్ గౌడ్, వైసిపి నాయకులు గంగుల రామిరెడ్డి, నజీర్, డాబా మనోహర్ రెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరులోని వైసిపి కార్యాలయంలో శ్రీశైల నియోజవర్గ సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, నియోజవర్గ పరిశీలకుడు సురేంద్ర రెడ్డిలు కేకు కట్ చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, ఎంపిపి నల్లకాలువ తిరుపాలమ్మ, జడ్పిటిసి శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్లలోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, మండల అధ్యక్షురాలు కె.నాగవేణి, నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు. వైసిపి నాయకులు, సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



బనగానపల్లె : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



నంద్యాలలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న నేతలు



ఆళ్లగడ్డ : వైసిపి జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి



నందికొట్కూరు : పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోగురు ఆర్థర్